క్లుప్తంగా

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

భీమునిపట్నం: ఇక్కడి మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల్లో మిగులు సీట్లకు అక్టోబర్ 3వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ శనివారం తెలిపారు. సీసీపీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో ఉన్న ఖాళీ సీట్లు భర్తీ కోసం ఈ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అలాగే 2023 పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాయపోయినా, పదో తరగతి కంపార్ట్‌మెంట్‌లో ఉత్తీర్ణత పొందివారుకూడా ప్రవేశానికి అర్హులని తెలిపారు. కాగా వీరికి ఎంటువంటి ఫీజుల రాయితీకానీ, స్కాలర్‌షిప్‌లుగాని ఉండవని, ఆసక్తిగలవారు తమ వద్దనున్న ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9912342045 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీకి అనిట్స్ విద్యార్థులు



బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీరామకృష్ణ

తగరపువలస : ఆదివారం నుంచి మూడు రోజుల పాటు పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరులో జరుగనున్న సీనియర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌కు సంగివలస అనిట్స్‌కు చెందిన విద్యార్థులు టి.వెంకట్ విశ్వాస్, ఆర్.మహతి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ ఇతర అధ్యాపకులు అభినందించారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస పంచాయతీ సర్వే నంబర్ 153/5లోని ప్రభుత్వ భూమిలో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాంబాబు, లక్ష్మణరెడ్డి అనే వ్యక్తులు భీమిలి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సుమారు 57 సెంట్ల విస్తీర్ణం కలిగిన ప్రభుత్వ భూమిలో అక్రమణలు తొలగించడం ద్వారా ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వవచ్చన్నారు. దీనిపై ఇప్పటికే పంచాయతీ వీఆర్వోకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని వారు ఆరోపించారు.

అవంతిలో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్‌పై వర్క్‌షాపు

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మేనేజ్‌మెంట్, బీటెక్ విద్యార్థులకు 'యువ పౌరులకు ఆర్థిక విద్య' అనే అంశంపై వర్కుషాపు జరిగింది. రిసోర్స్ పర్సన్ మాడెం శ్రీను, విద్యార్థులకు ఆర్థిక రంగంలో అవసరమైన నైపుణ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛత హీ సేవ

కొమ్మాది: భారత ప్రభుత్వం తొమ్మిదేళ్ల స్వచ్ఛ్ భారతా మిషన్ వేడుకల్లో భాగంగా బీచ్ రోడ్డు మంగమారిపేట శిలా తోరణం వద్ద ఆదివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు క్లీన్‌నెస్ డ్రైవ్ నిర్వహించనున్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన గణిత అధ్యాపకుడు బొల్లా సుబ్రహ్మణ్యానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. అప్లయిడ్ మాథ్స్‌లో సీహెచ్. శాంతి సుందరరాజు పర్యవేక్షణలో 'ఫజ్జీ ఐడియల్స్ అండ్ ఫిల్టర్స్ ఆఫ్ సెమిలాటీసెస్' అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ వచ్చింది. ఈ మేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి పీవీజీడీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యాన్ని అవంతి ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ అభినందించారు.

ప్రతి ఇంట ఆరోగ్యం..జగనన్న ధ్యేయం



వైద్య పరీక్షల కోసం క్యూ కట్టిన ప్రజలు

కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి రక్షణగా ఉంటుం దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభోత్సవంలో కలెక్టర్ మల్లికార్జునతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ శనివారం నుంచి 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్టణ, పల్లె ప్రాంతాల్లో ఓ మహాయజ్ఞంలా నిర్వహిస్తామని, ప్రతి చోట ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో 122 చోట్ల జగనన్న సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వృద్ధులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ సిబ్బంది సేవలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ 4వ వార్డు చేపలుప్పాడ యూపీహెచ్‌సీ వద్ద శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులో సంగివలస అనిల్ నీరుకొండ వైద్య సిబ్బంది తమ సేవలు అందించారు. నర్సింగ్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ సీభా ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఇతర సిబ్బంది పాల్గొని వైద్యశిబిరంలో పాల్గొన్న వారికి సహాయ సహకారాలు అందించారు.

పేదలకు ఎంతో మేలు

ఆనందపురం : జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు ఎంతో మేలు జరగనుందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. ఆనందపురంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్నవారిని ఇప్పటికే వైద్య సిబ్బంది గుర్తించారని వారికి శిబిరాలలో చికిత్సలు చేస్తున్నట్టు వివరించారు. స్థానికంగా వైద్య బృందాలు నయం చేయలేని రోగాలు గల వ్యక్తులను పెద్దాస్పత్రులకు తరలించి చికిత్సలు ఆందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో ముందు చూపుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.



క్యాంపులో పాల్గొన్న ఎన్ఆర్ఐ సిబ్బంది



మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

అనంతరం రోగులకు మందులు, కళ్ల జోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చందక లక్ష్మి, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి ఉమాదేవి, మండల ప్రత్యేకాధికారి పద్మ, వైద్యాధికారి గంగునాయుడు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, నాయకులు చందక అప్పలస్వామి, షిణగం రామారావు, పిన్నింటి వెంకటరమణ, రౌతు వెంకటరావు, లెంక రాంబాబు, చందక సూరిబాబు బిఆర్‌బి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ప్రజలకు ఆరోగ్య రక్ష



మధురవాడలో జగనన్న సురక్ష బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 కేంద్రం మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత మెగా వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల అనారోగ్య సమస్యలు తెలుసుకుని ప్రాథమికంగా 7 రకాల పరీక్షలు నిర్వహించారన్నారు. మరింత మందికి స్పెషలిస్టుల ద్వారా సేవలు అందించడం కోసం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా దంత సమస్యలు ఉన్న పాఠశాలల పిల్లలను గుర్తించి వారికి పరీక్షలు చేయిస్తున్నామన్నారు. విశాఖ జిల్లాలో ప్రత్యేంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్‌తో కంటి పరీక్షలు కూడా చేయిస్తున్నామని తెలిపారు.

శరవేగంగా భీమిలి అభివృద్ధి

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ యూపీహెచ్‌సీలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మానస పుత్రికలని అన్నారు. మధురవాడ పీహెచ్‌సీని సీహెచ్‌సీ స్థాయికి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భీమిలి నియోజకవర్గానికి 10 పీహెచ్‌లు, యూపీహెచ్‌సీలు ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా న్యూట్రిషన్ ఫుడ్‌పై అవగాహన కోసం ఏర్పాటు చేసి మిల్లెట్ స్టాల్‌ను ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు, ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, జేసీఎస్ కన్వీనర్ కుడితి రామారావు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, వాండ్రాసి రవికుమార్, బంగారు ప్రకాశ్, పాపారావు, డీఈవో ఎల్. చంద్రకళ, జెడ్సీ కనక మహాలక్ష్మి, డీఎంహెచ్‌వో పి. జగదీశ్వరరావు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ రాజేశ్, డీసీహెచ్ఎస్ రమేష్ కిషోర్, జీవీఎంసీ సీఎమ్‌హెచ్‌వో హేమంత్, ఏమ్‌హెచ్‌వో కిషోర్, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. ప్రశాంతి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, సీడీపీవో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మధురవాడ పీహెచ్‌సీ వద్ద పరీక్షలకు వచ్చిన వృద్ధుల క్షేమసమాచారం తెలుసుకుంటున్న కలెక్టర్

భువనేశ్వర్ కాలనీలో అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వార్డు అధ్యక్షుడు గుడ్లపోలిరెడ్డి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి భువనేశ్వర్ కాలనీలో క్రేజీ బోయ్స్ ఏర్పాటు చేసిన వినాయకచవిత ఉత్సవాల్లో భాగంగా శనివారం 2 వేల మందికి మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఇక్కడ ఏర్పాటు చేసిన మండపం వద్ద వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణపతి మండపాల వద్ద అన్నదానాలు

తగరపువలస: గణపతి మండపాల వద్ద శనివారం జీవీఎంసీ భీమిలి జోన్‌లో పలుచోట్ల అన్నదానాలు జరిగాయి. ఒకటోవార్డు బాలాజీనగర్‌లో జరిగిన అన్నదానాన్ని 1,2 వార్డుల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగుపల్లి సూరిబాబు, లెంక రమేష్, కోండ్రు రమణ, బంక శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే రెండో వార్డు చిల్లపేట సిగడాం మహాలక్ష్మి ఆలయం మండపం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఉత్సవ కమిటి ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు కన్వీనర్ల అధ్యక్షుడు ప్రసాద్

వైఎస్సార్ కాలనీలో..

మధురవాడ : వరసిద్ధి వినాయక ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 5వ వార్డు వైఎస్సార్ కాలనీలో శనివారం భారీ అన్న సమారాధన జరిగింది. వైఎస్సార్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు భక్తులు అన్న ప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాలనీ, శివశక్తి నగర్, డ్రైవర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, కొమ్మాది జంక్షన్ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నేమాని అనేష్‌కుమార్, హేంత్, సాయి, రమణ, హేష్, నాని, కుమార్, గ్రామ పెద్దలు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

త్వరలో ఫిష్‌ల్యాండింగ్ జెట్టీ



తీరంలో ఫిష్‌ల్యాండింగ్ జెట్టీ ఏర్పాటు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం: భీమిలి తీరంలో త్వరలో మత్స్యకారులకు అన్ని విధాలుగా సదుపాయంగా ఉండే ఫిష్‌ల్యాండింగ్ జెట్టీ నిర్మాణం పూర్తి కానుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం తీరంలో దీన్ని ఏర్పాటు చేయనున్న స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో మత్స్యకారుల ఏళ్లనాటి కల ఫలించనుందన్నారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.28 లక్షలు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో దేవదాయ శాఖ తనిఖీదారు బి.వసంతకుమార్ ఆధ్వర్యంలో హుండీని శనివారం లెక్కించగా 14 రోజులకు రూ.16.28 లక్షలు వచ్చాయి. బంగారం నాలుగు గ్రాముల 513 మిల్లీగ్రాములు, వెండి 172 గ్రాముల 700 మిల్లీగ్రాములు, ఇతర దేశాల డాలర్లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.బోళన్ తెలిపారు. హుండీ లెక్కింపులో శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాలయ సిబ్బంది, బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి మధురవాడ సమస్యలు

మధురవాడ: జాతీయ రహదారిని ఆనుకుని విశాలమైన ప్రదేశంలో ఉన్న మధురవాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం (పీఏసీఎస్)ని అన్ని రకాలుగా రక్షించడానికి చర్యలు చేపట్టాలని మధురవాడ అఖిల పక్షపార్టీలు నాయకులు కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. మధురవాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చిన ఆయనకు వినతి పత్రం ఇచ్చారు. మధురవాడ పరిసర 20 గ్రామాలకు చెందిన 400మంది వరకు ఓటు హక్కు ఉన్న సభ్యులతో ఇది నడుస్తోంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అభివృద్ధి చేశారు. దీనిని క్రెడిట్ సొసైటీగా మార్చాలని 4 ఏళ్లుగా కొరుతున్నా అధికార యంత్రాంగం నుంచి స్పందలేదన్నారు. ఈ నెల 21న జిల్లా సహకార సంఘ అధికారి నేతృత్వంలో హెచ్‌పీసీఎల్ అధికారులు వచ్చి షాపింగ్ కాంప్లెక్స్ స్థానంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తామని కొలతలు వేశారని, మహా జనసభ ఆమోదం లేకుండా ఇలా చెయ్యడం సరికాదని, యథావిధిగా పాత పద్ధతిలోనే కొనసాగించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో మధురవాడకు వైఎస్సార్ సీపీ నాయులు పీకేఎం పాత్రుడు, పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు, పిల్లా సత్యనారాయణ, కుడితి రామారావు, పెంద్ర అప్పన్న తదితరులు వినతి పత్రం ఇచ్చారు. అలాగే జీవీఎంసీ 6వ వార్డు రిక్షా కాలనీలో కాళీగా ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమణకు ప్రయత్నం చేస్తున్నారని దీని రక్షణకు చర్యలు చేపట్టాలని కాలనీ అధ్యక్షుడు జోగారావు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.



మధురవాడ పీఏసీఎస్ సమస్యపై కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న స్థానిక నాయకులు

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట

తగరపువలస: ఈ నెల 15న ప్రారంభం కానున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిట్టివలస కార్మికవాడలో శనివారం ఉత్సవరాట వేశారు. 20న భవానీలతో అగ్నిగుండం తొక్కించడం, అన్నదానం, 25న అమ్మవారి అనుపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు పిల్లా మాణిక్యం, దుంప రాంబాబు తెలిపారు. అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమానికి కార్మికవాడకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నీళ్ల ట్యాంకు వద్ద ఉత్సవరాట వేస్తున్న స్థానికులు

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

పద్మనాభం: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను సీఎం వై.ఎస్.జగన్‌మోహన రెడ్డి పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొవ్వాడ పంచాయతీ కొత్త కొవ్వాడలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకుని 23 రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సంక్షేమ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. బాందేవుపురం పంచాయతీ విజయరాంపురంలో 341 ఎకరాలకు సంబంధించి 289 మందికి జగనన్న భూ రక్ష కింద పట్టాలు పంపిణీ చేశారు. కొత్తకొవ్వాడలోని జగనన్న సురక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, బాందేవుపురం సర్పంచ్ వాజిగాని ఆదిలక్ష్మి, కొవ్వాడ సర్పంచ్ పొన్నకాయల రత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర పైడినాయుడు, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, బి.వి.ఎస్.ఎన్.రాజు, జి.వి.కె.కె. వర్మ, బోని సన్యాసినాయుడు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పావురాల పార్కుపై స్టే తొలగింపు

ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా తీర్పు

భీమునిపట్నం : భీమిలి బీచ్‌రోడ్డులోని లైట్‌హౌస్ ఎదురుగా ఉన్న పావురాల పార్కు ప్రైవేటు వ్యక్తులకే చెందుతుందని హైకోర్టు స్పష్టం చేసింది. జీవీఎం వేసిన స్టేను హైకోర్టు కొట్టివేసింది. దీంతో పార్కును స్వాధీనం చేసుకునేందుకు ప్రైవేటు వ్యక్తులు శనివారం పావురాల పార్కుకు చేరుకున్నారు. 2004లో ఇక్కడ సుమారు 5 సెంట్ల స్థలంలో అప్పటి మున్సిపాలిటీ ఈ పావురాల పార్కును నిర్మించింది. ఇందులో పావురాలు, కుందేళ్లు, తాబేళ్లు ఉండేవి. కాగా 2006లో ఈ పార్కు స్థలం తమదంటూ కొందరు వ్యక్తులు రాగా.. అప్పటి మున్సిపాలిటీ ఇది తమదంటూ విశాఖ సబ్‌కోర్టులో కేసు వేసింది. అప్పుడు ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిపై జిల్లా కోర్టులో మున్సిపాలిటీ మళ్లీ కేసు వేయగా అప్పుడు కూడా ప్రైవేటు వ్యక్తులకే అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో జీవీఎంసీ హైకోర్టును ఆశ్రయించింది. అక్కడ కూడా ప్రైవేటు వ్యక్తులకే హక్కు ఉందని నిర్ధారించింది. దీంతో కోర్టు స్టే తొలగింపు పత్రాలను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఏసీపీ శ్రీనివాస్, స్టాండింగ్ కౌన్సిల్ రాంబాబును తదితరులను కలిసి కోర్టు అందజేశారు. దీనిపై జడ్సీ రాము మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన స్టే తొలగింపు ఆదేశాలను జీవీఎంసీ కమిషన్‌తోపాటు ఇతర అధికారులను తెలుపుతామని చెప్పారు. కోర్టు ఆదేశాలమేరకు పార్కు స్థలాన్ని వారికి అప్పగిస్తామన్నారు.



బీచ్‌రోడ్డులోని పావురాల పార్కు

150 మంది వాహనదారులపై కేసులు

పీఎంపాలెం: జాతీయ రహదారిపై పరిమితికి మించి వేగంగా వాహనాలు నడుపుతున్న 150 మందిపై పీఎం పాలెం ట్రాఫిక్ పోలీసులు శనివారం కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి స్థానిక ఎస్ఐ మురళీకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాహనాల వేగం కచ్చితంగా గుర్తించే స్పీడ్ లేజర్ గన్‌ను ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారిపై ఏర్పాటు చేశారు. 150 వాహనాలు పరిమితికి మించిన స్పీడుతో ప్రయాణించినట్టు స్పీడ్ గన్ గుర్తించింది. ఈ మేరకు వాహన దారులపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



స్పీడ్ లేజర్ గన్ ఉపయోగించి వాహనాల స్పీడు గుర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నేడు అష్టావధానం

మధురవాడ: మధురవాడ మారుతీ విప్ర సేవా సమితి ఆధ్వర్యంలో కొమ్మాది త్రిశక్తి ఫంక్షన్ హాలులో వినూత్న సాహిత్య, సరస్వత ద్విగళ అష్టావధానం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు చెప్పారు. ఆదివారం సాయంత్రం 3గంటలు నుంచి ఇక్కడ అవధానం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి అవధానులుగా ఉభయ కళా తపస్వి సుసరావు చంద్రశేఖర అవధాని, రంపసాయి కుమార్ అవధాని పాల్గొంటారన్నారు.

అతి పే..ద్ద అరటి గెల

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌కు శనివారం 300 పండ్లతో పెద్ద అరటి గెలను ఓ రైతు తీసుకొచ్చాడు. కోటవురట్ల మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన శ్రీను అనే రైతు ఇక్కడ బజార్‌కు తీసుకొచ్చిన సుమారు మూడున్నర అడుగులకు పైగా పొడవున్న ఈ అరటి గెలకు 16 పెడలు ఉన్నాయి. దానికి సుమారు 300 అరటి పండ్లు ఉన్నాయి. సాధారణంగా అరటి గెలకు 7 నుంచి 10 వరకు పెడలు, 150 నుంచి 180 వరకు పండ్లు ఉంటాయి. సపోటా ముకిరీ అనే పిలిచే ఈ గెలకు మాత్రం 16 పెడలున్నాయి.



ఎంవీపీ రైతు బజార్‌లో 300 పండ్లతో అరటి గెల